ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 12.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మహారాజా అగ్రసేన్ ప్రతిపాదించిన సమానత్వం, అహింస, సామాజిక సామరస్యం వంటి ఆదర్శాలు సమాజాభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తాయని గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు.

2. ప్రధాని నరేంద్ర మోదీ గడిచిన 25 ఏళ్లుగా నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యారని, అది ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి కొనియాడారు.

3. ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో వాటిని పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

4. కేసీఆర్ హయాంలో రిజర్వాయర్లతో నేలలు సస్యశ్యామలమయ్యాయని, విద్యుత్ మిగులు రాష్ట్రం సాధించామని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు.

-----------------------------------

**గవర్నర్**

మహారాజా అగ్రసేన్ ప్రతిపాదించిన సమానత్వం, అహింస, సామాజిక సామరస్యం వంటి ఆదర్శాలు సమాజాభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తాయని గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకల్లో గవర్నర్

పాల్గొని ప్రసంగించారు.  వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో రాణిస్తూనే సామాజిక సేవలో ముందంజలో ఉన్న అగర్వాల్ సమాజ పాత్రను ఈ సందర్భంగా గవర్నర్ కొనియాడారు.

డెస్క్

-----------------------------

**ముఖ్యమంత్రి**

గోవాలో భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, సీఎం ప్రమోద్ సావంత్ కాకుండా ఆయన 'ప్రాపర్టీ సావంత్' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. గోవా పర్యటనలో భాగంగా 'గోయ్ రాఖోన్స్' యాత్రలో ఆయన మాట్లాడారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేరుతో పేదలు, SCలు, మైనారిటీల ఓట్లను ప్రధాని మోదీ తొలగిస్తున్నారని మండిపడ్డారు. గోవాను డ్రగ్స్ పెడ్లర్ల అడ్డాగా మార్చారని ఆరోపించారు. భాజపాను నమ్మి మరోసారి మోసపోవద్దని, ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని పిలుపునిచ్చారు.

డెస్క్

----------------------------

**కిషన్ రెడ్డి**

ప్రధాని నరేంద్ర మోదీ గడిచిన 25 ఏళ్లుగా సెలవు లేకుండా నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యారని, అది ప్రతి కార్యకర్తకూ స్ఫూర్తిదాయకమని  కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి కొనియాడారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నిర్వహించిన 'సేవా సంకల్ప అభియాన్' సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గడిచిన 25 ఏళ్లుగా సెలవు లేకుండా నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యారని, అది ప్రతి కార్యకర్తకూ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశ సంక్లిష్ట సమస్యలను పరిష్కరించి, భారత్‌ను ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ పటిష్టమైన పునాదులు వేశారని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

డెస్క్

-------------------------

**టీటీడీ ఆలయం**

ఖమ్మం సమీపంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల స్థలంలో రూ.100 కోట్లతో తిరుమల తరహాలోనే ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి ప్రవచనాలు అందించగా, భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు.

**పీటీసీ - ఖమ్మం**

-----------------------------

**కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

హైదరాబాద్–విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65 (NH-65) విస్తరణ పనులను వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి న్యూఢిల్లీలో NHAI ఛైర్మన్ సంతోష్ కుమార్‌ను కోరారు. ఈ ఆరు లేన్ల విస్తరణతో ట్రాఫిక్ తగ్గి ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. నవంబర్ 11తో టెండర్ల ప్రక్రియ ముగియనుందని, 2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ స్పష్టం చేశారు.

**డెస్క్**

----------------------------

**రామ చందర్ రావు**

రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నా సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోకుండా ఢిల్లీ పర్యటనలు చేయడం దారుణమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. ఇవాళ నాంపల్లి బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో సాగుతోందని, కేంద్రం తెలంగాణకు రూ.లక్షల కోట్లు కేటాయించిందని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసేవరకు

రాహుల్ గాంధీని రాష్ట్రంలో అడ్డుకుంటామని, రైతుల తరఫున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

**పీటీసీ - హైదరాబాద్**

------------------------------

**బతుకమ్మ వేడుకలు**

తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని లలిత కళా తోరణంలో అటుకుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా సాగిన ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్యాలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర జానపద కళలు, సంప్రదాయాలను పరిరక్షించి పర్యాటకులకు పరిచయం చేసేందుకు ఈ ఉత్సవాలను నిర్వహించినట్లు పర్యాటక శాఖ తెలిపింది.

**డెస్క్**

---------------------------------

**ముఖ్యమంత్రి**

ప్రజల ఓట్లు తొలగించేందుకే 'సర్'ను వాడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈరోజు ఢిల్లీలో ముఖ్యమంత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని అన్నారు. అంబేడ్కర్ ప్రపంచమంతా తిరిగి ఎన్నో రాజ్యాంగాలను అధ్యయనం చేశారన్నారు. ఎంతో అధ్యయనం అనంతరం ఓటుహక్కును రాజ్యాంగంలో చేర్చారన్నారు. ఇప్పుడు ఆ ఓటు హక్కును తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు.

**డెస్క్**

------------------------------

**పొన్నం ప్రభాకర్**

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో వాటిని పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఉన్నతాధికారులతో సమావేశమై

సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరలను తగ్గిస్తామని చెప్పారు. ప్రజలకు భారం కాకుండా, ప్రజా రవాణాను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**డెస్క్**

--------------------------------

**హరీష్ రావు**

సిద్దిపేట జిల్లా ఏర్పాటు కేసీఆర్ చలవేనని, పరిపాలన వికేంద్రీకరణతోనే ప్రాంతం అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలో జరిగిన దశాబ్ది ఉత్సవాల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో రిజర్వాయర్లతో నేలలు సస్యశ్యామలమయ్యాయని, విద్యుత్ మిగులు రాష్ట్రం సాధించామని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కృత్రిమ కరువు తెచ్చిందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మళ్లీ ప్రజా ప్రభుత్వం వస్తుందని చెప్పారు.

**పీటీసీ – సిద్దిపేట**

------------------------------

**ఆది శ్రీనివాస్**

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. నిన్న రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల రగుడు మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

--------------------------

**వరంగల్**

వినియోగదారుల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ములుకనూర్ సహకార సంఘం ప్రధాన లక్ష్యమని సంఘ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అలిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ములుకనూరులో వరి సాగులో పురుగుమందుల అవశేషాల నియంత్రణపై రైతులకు అవగాహన సదస్సు

నిర్వహించారు. ఈ సందర్భంగా వరి శాస్త్రవేత్త డాక్టర్ వై.చంద్రమోహన్ సస్యరక్షణ చర్యలు, శాస్త్రీయ పద్ధతులపై రైతులకు వివరించారు. నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించేందుకు రైతులతో కలిసి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

**పీటీసీ – వరంగల్**

----------------------------------

**కేటీఆర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారక రామారావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మండేపల్లిలో కళాశాల శాశ్వత భవన నిర్మాణ పనుల్లో జాప్యాన్ని నివారించాలని కోరారు. ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఇంజినీరింగ్ కళాశాలను ప్రైవేటు భవనంలోకి తరలించే ప్రయత్నాలను నిలిపివేయాలని, విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని సీఎం తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**డెస్క్**

------------------------------

**నల్గొండ**

రహదారుల నిర్మాణంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో పలు రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని తెలిపారు. ఏఎమ్మార్పీ నీటితో చెరువులను నింపి, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన వెల్లడించారు.

**పీటీసీ - నల్గొండ**

-----------------------------

**వేములవాడ**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి, శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి చతుషష్టి, కన్యకా సుహాసిని పూజ లను వేద మంత్రోచ్చారణలతో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు బ్రహ్మచారిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------

**బాసర**

నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శారదీయ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

**పీటీసీ - నిర్మల్**

-------------------------

**రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈనెల 21 నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. అక్టోబర్ 21న లింగంపేటలోని స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి నివాళులర్పిస్తామన్నారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------

**చిన్నారి హత్య కేసు**

బొల్లారంలో ఆరేళ్ల చిన్నారి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి, సెక్యూరిటీ గార్డు ని అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చిన్నారిని కిడ్నాప్ చేసి, నడుముకు ఇటుకలు కట్టి వాటర్ సంపులో పడేసినట్లు గుర్తించారు. రూ.20 లక్షలు డిమాండ్

చేసిన నిందితుడితో పాటు, సొసైటీకి చెందిన మరో నలుగురు సెక్యూరిటీ గార్డులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

**డెస్క్**

------------------------------